యువతకు శిక్షణ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ అల్లంపుట్టు గ్రామంలో లయ సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్క్స్‌కు సంబంధించి యువకులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. లయ సంస్థ కోఆర్డినేటర్ కే.వెంకటరమణ మాట్లాడుతూ, మండలంలో ఆయా గ్రామాల్లో నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సుమారు 40 మంది యువకులకు ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్క్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్వయంగా మరమ్మతులు చేసి ఎంతో కొంత ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.

శిక్షణ పొందుతున్న యువకులు

ఆదివాసీలతోనే ఉద్యోగాలు భర్తీ చేయాలి

-స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి
-ఆదివాసీ నిరుద్యోగుల సదస్సులో వక్తల డిమాండ్

ప్రజాశక్తి పాడేరు : ఆదివాసి ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉద్యోగాలన్నీ ఆదివాసులతోనే భర్తీ చేయాలని బుధవారం పాడేరులో నిర్వహించిన ఆదివాసి నిరుద్యోగుల సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు యస్ దర్మన్నపడాల్ అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సదస్సులో ఆదివాసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్విభజనలో ఆదివాసీ జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ ప్రాంతంలో ఉన్నత విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య పెరిగిందని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ పొందుతున్నా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ఆదివాసీ నిరుద్యోగుల ఆశలపై జగన్ ప్రభుత్వం నీళ్లుచల్లిందన్నారు. 2020 ఏప్రిల్ 22న జి.ఓ 3ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని నాటి నుంచి నేటి వరకు ఆదివాసులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. గిరిజన గురుకులం, ఏకలవ్యతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఆదివాసులకు ఉద్యోగం ఇవ్వ లేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రధాని మోడీ ఎన్నికల హామీ ఇచ్చి 9 సంత్సరాలైందని దుయ్యబట్టారు.ప్రశ్నించిన నిరుద్యోగులకు బజ్జీలు, పకోడీలు అమ్ముకొండంటూ అమిత్ షా సలహా ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం తక్షణమే 5 కోట్ల మందికి ఉపాధి కల్పించకపోతే దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నెట్టబడుతుందని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత 5 లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మూసేశారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు, మైనింగ్‌ల దోపిడీని ఏజెన్సీ ప్రాంతంలో పాలకులు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగనన్న వివిధ ప్రభుత్వ శాఖలో ఖాళీ ద్యోగాలు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 56వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్లు అల్లూరిజిల్లాలో ఆదివాసీ యువతకు 10 పోస్టులు కూడా రావన్నారు. గిరిజన సంఘం నిర్వహించిన పోరాట ఫలితంగా 2019 సంవత్సరంలో 1495 పోస్టులను మంజూరు చేస్తూ జీవో 10 ని నాటి తెలుగుదేశం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి భర్తీ చేయలేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసీ ఎమ్మెల్యే, ఎంపిళ్లకు టికెట్ కోసం ఆదివాసీ సమాజానికి జరుగుతున్న అన్యాయంపై నోరుమెదపలేదన్నారు. ఆదివాసీ యువత కదలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు కృష్ణారావు, సురేష్, కొండలరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కె.జీవన్, కార్యదర్శి చిన్నారావు, ఆదివాసి మాతృ భాష నేటివ్ స్పీకర్స్ నాయకులు సర్బు నాయుడు, చిట్టి బాబు, చంద్రయ్య, వీరయ్య, నిరుద్యోగులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స

సమావేశంలో పాల్గొన్న రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే తదితరులు

చెత్త తొలగింపునకు చర్యలు

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రతి పంచాయతీలో స్వచ్ఛభారత్ ప్రోగ్రాం ద్వారా ఎక్కడికక్కడ చెత్తను తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. భారత ప్రభుత్వ యస్ఎసి అడ్వైజర్ సి.శ్రీనివాసన్ బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో జరిగిన కార్యక్రమంలో సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్ మేనేజమెంట్ ప్రోగ్రాం ద్వారా ఇతర రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్ కొన్ని ప్రాంతాలలో చెత్తను ఇంటింటికి వెళ్లి సిబ్బంది ఏవిధంగా సేకరిస్తున్నారో ఐటిడిఎ పిఒకి, డిఎఫ్ఒ జిజి నరేంద్రన్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ప్రధానంగా పర్యటక ప్రాంతాల్లోనూ, మండల కేంద్రాల్లోనూ, వారం వారం సంత జరిగే ప్రాంతాల్లోనూ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పారిశుధ్య సిబ్బందికి యూనిఫారం, క్యాపు, షూస్ వంటి వాటికి ఎంత ఖర్చవుతుందో నివేదికల సమర్పించాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించేవారు ఎక్కడబడితే అక్కడ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ పరికరాలు, పేపర్ ప్లేట్లు వేస్తున్నారని, వాటిని నివారించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రంపచోడవరంలోని వివిధ కార్యాలయాలలో పాత మెటీరియల్, పాత భవనాల్లో చెత్తాచెదారం తొలగిస్తామన్నారు. రంపచోడవరం డిఎఫ్ఒ జిజి నరేంద్రన్ మాట్లాడుతూ పర్యటక ప్రాంతాల్లో ప్లాస్టిక్, పేపర్ ప్లేట్లు, వంటివి తొలగించడానికి వారానికి రెండు రోజులు పనిచేయుటకు కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కొనసాగిన సిహెచ్‌డబ్ల్యుల రిలే దీక్షలు

-ఏజెన్సీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ మద్దతు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో వైద్యఆరోగ్య శాఖలో పని చేస్తున్న సిహెచ్ డబ్ల్యులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశావర్కర్లుగా మార్చాలని పాడేరు ఐటిడిఏ ఎదురుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరవ రోజు బుధవారం కొనసాగాయి.ప్రభుత్వం స్పందించి తమను ఆశ వర్కర్లుగా మార్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.గిరిజన ప్రాంత మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శెట్టి నాగరాజు దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలియజేశారు. ఒకే పని విధానం కలిగివున్న సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా మారుస్తామని ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కచ్చితంగా చేయాలని డిమాండ్ చేశారు. సిహెచ్‌డబ్ల్యు నెలకు 4000 రూపాయలతోటే జీవితం గడపడం అన్నది చాలా దారుణమైన విషయమన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు గిరిజన ప్రాంత మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, గిరిజన సంఘం నాయకులు సుందర్‌రావు, నడివీధి యూత్ అసోసియేషన్ సభ్యులు మద్దతు ఇచ్చారు.

దీక్షలు చేపడుతున్న సిహెచ్‌డబ్ల్యులు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని అతిమారుమూల ప్రాంతమైన రంగబయులు పంచాయతీ చంపపుట్టులో ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ను బుధవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ. తుహిన్ సిన్హా ఏఎస్‌పి దీరాజ్, సీఐ సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు.గిరిజన యువత గంజాయి సాగుకు, అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రథమ స్థానంలో వలజంగి టీం గెలుపొందింది. ఎస్పీ చేతుల మీదగా నగదు బహుమతిని అందజేశారు .ద్వితీయ శ్రేణిలో రంగబయలు, తృతీయ స్థానంలో కోసోపుట్ జట్టు విజయం సాధించాయి.క్రీడాకారులను వాలీబాల్ కిట్లు, టీ షర్టు ఎస్సై కే రవీంద్ర అందజేశారు. అనంతరం మండల కేంద్రం నుండి రుడకోట మీదుగా కుమడ వరకు ఉచిత బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించార. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ2 భాగ్యవతి, పంచాయతీ సర్పంచ్ దనియ పాల్గొన్నారు.

ఆడుతున్న క్రీడాకారులు

ఆర్థిక సాయం, బియ్యం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఆర్‌సి సిబ్బందికి యుటిఎఫ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి -అడ్డతీగల

ఐదు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల శాఖ ఆర్థిక సాయం అందజేసింది. ప్రతి ఉద్యోగికి రూ.5000 చొప్పున నగుదు, 26 కేజీల చొప్పున సన్నబియ్యం బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, అడ్డతీగల ఎంఈఓ-2 శ్రీనివాస్, అడ్వకేట్ శ్రీధర్, పూర్వపత్రిక సంపాదకులు అచ్యుత్, ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యుటిఎఫ్ ఏఎస్ఆర్ జిల్లా కార్యదర్శి తేజరావు, జిల్లా కౌన్సిలర్ నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కుంజం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కెవి.రాఘవులు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ పప్పుల రాంబాబు, మంగరాజు మహిళా అధ్యక్షురాలు జెవిబి రమణమ్మ మహిళా కార్యదర్శి కమల రత్నం, కెసిఆర్ జిల్లా కౌన్సిలర్ చిన్నిబాబు, వేమ బాలరాజు, మిరియాల చిన్నారావు, సావిత్రి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సాయం అందించడం పట్ల ఎంఆర్‌సి సిబ్బంది బుల్లి దొర, రవి, వాసు, రమణ, మెసెంజర్ ఈశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి మేనిఫెస్టోపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -విఆర్.పురం

మండలంలోని ములకనపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో టిడిపి నాయకులు బుధవారం బాబు షూరిటీ -భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు బీరక సూర్యప్రకాశ్‌రావు ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి భవిషత్ గ్యారంటీ కరపత్రాలు ఇచ్చి నమోదు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శీలం నారాయణ, శీలం ముత్తయ్య, సవలం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను గుర్తించాలి

ప్రజాశక్తి -కొయ్యూరు : జనసేన పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించాలని ఆ పార్టీ నాయకులు వి.గంగులయ్య పిలుపునిచ్చారు. మండలంలోని మూలపేట పంచాయితీ మర్రిపాలెంలో బుధవారం జరిగిన జనసేన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18ఏళ్ళు దాటిన యువతి యువకుల ఓట్లు నమోదు చేయించాలన్నారు. గిరిజనులకు జనసేనపార్టీ సిద్ధాంతాలు, ఆశయాలపై చైతన్యం కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల ముఖ్య నాయకులు మసాడి భీమన్న, వంతల బుజ్జిబాబు, ఉల్లి సీతారాం, కిల్లో రాజన్, తాంగుల రమేష్, అశోక్ సాలేబు, గొంది మురళి, కొయ్యూరు మండల నాయకులు గూడెం లక్ష్మణ్, సాగిన, బుజ్జి బాబు, పిట్టా సుదీర్ బాబు, సిహెచ్ సిద్ధు, జూర్రా సూర్యప్రకాష్, కాకర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలాటంలో తృతీయ బహుమతి

ప్రజాశక్తి రాజవొమ్మంగి

కాకినాడ జేఎన్టీయూలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రియా పిల్లల పండుగలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలాటంలో తృతీయ బహుమతి సాధించారు. ఈ పోటీలకు జెడ్‌పి స్కూల్ నుండి 60 మంది విద్యార్థులను పాల్గొన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డివి గోపాలకృష్ణ విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండలంలోని మారు మూల రంగబయలు పంచాయతీ చంపపుట్టు గ్రామంలో స్థానిక ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సంజీవని మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన మెగా వైద్య శిబిరానికి 290 మంది ప్రజలు వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఇంటి వద్దకే వైద్యం అందిస్తుందన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. గర్భిణిలు ఎప్పటికప్పుడు వైద్య అధికారులను సంప్రదిస్తూ మెరుగైన వైద్యం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ కార్యదర్శి కోనా ప్రకాష్, ఏఎస్పి దిరాజ్, సీఐ సత్యనారాయణ, గ్రామీణ వైద్య జిల్లా అధ్యక్షులు మూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో డిసెంబర్ 14, 15, 16 తేదీలలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. జీవన్‌కృష్ణ, పి. చిన్నారావు పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అధ్యయనం - పోరాటం నినాదంతో ఆదివాసీ విద్యార్థులకు నైపుణ్యమైన విద్య అందించుటకు నిరంతరం పోరాడుతోందని చెప్పారు. మౌలిక వసతులు, మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలు రూ.3వేలు పెంచాలని, జి. ఓ 3 అమలు, ఖాళీగా వున్న టీచర్ పోస్టులు భర్తీ, విద్యార్థులకు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, వైద్య విద్య వంటి వాటిపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. బాలికల హాస్టల్స్ రక్షణ ప్రహారీ గోడలు, మరుగుదొడ్లు నిర్మాణం కోసం పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. గిరిజన విద్యా సంస్థల్లో అనారోగ్యంతో గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్స్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచకపోవడంతో అనేకమంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విద్యార్థుల సమస్యలపై 43 రోజులుగా ఐటిడిఏ కార్యాయలం ఎదురుగా నిరాహారదీక్షలు, అధికారులతో చర్చలు జరిపి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన విద్యా విధానం గిరిజన విద్యాభివృద్ధికి, నాణ్యతకు ఆటంకంగా మారిన నేపథ్యంలో గిరిజన విద్యారంగంలో సమస్యలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.సింహాద్రి, కార్తీక్, ఐసుబాబు పాల్గొన్నారు.

పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు

గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సులో ఐటిడిఎ పిఒ, డిఎంహెచ్ఒ హెచ్చరిక

ప్రజాశక్తి-చింతూరు

ఏజెన్సీ ప్రాంతంలో గ్రామీణ వైద్యులు తమ పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుల్లయ్య హెచ్చరించారు. విలీన నాలుగు మండలాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతులు లేని, అర్హత లేని ఆర్ఎంపిల పేరుతో ఉన్న వైద్య కేంద్రాలను తనిఖీలు నిర్వహించి సీజ్ చేసిన విషయం విధితమే. దీంతో 40 రోజులుగా పలు గ్రామాల్లో ప్రథమ చికిత్సలు అందించేవారు లేకపోవడంతో ఇబ్బంది పడ్డ రోగుల విజ్ఞప్తి మేరకు అధికారులు గ్రామీణ వైద్యుల అర్హతలను, వారి అనుమతి పత్రాలను, వైద్య కేంద్రాలను పరిశీలించి, కొంతమేరకు అర్హతలు ఉన్న వారికి అనుమతులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ, డిఎంహెచ్ఒ మాట్లాడుతూ నాలుగు మండలాల్లో 35 గ్రామీణ వైద్యుల కేంద్రాలు పూర్తిస్థాయిలో తగిన అర్హతలు లేనందున నిలిపివేస్తున్నామని, అర్హతలు చూపించిన పిదప పరిశీలిస్తామని తెలిపారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అని బోర్డులు ఉండాలని, బెడ్లు ఉండ కూడదని, సెలైన్ బాటిళ్లు, ఇంజక్షన్లు చేయకూడదని, సీరియస్‌గా ఉన్న కేసులను తీసుకోరాదని, ప్రమాదకరమైన స్టెరాయిడ్స్ ఉపయోగించకూడదని, మందుల ప్రిస్క్రిప్షన్‌లు, లెటర్ ప్యాడ్లు వాడకూడదని, పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామీణ ప్రజలకు చికిత్స మాత్రమే అందివ్వాలని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఎంత మాత్రం వైద్యం చేయరాదని తెలిపారు. ఫీజులు అధిక మొత్తంలో తీసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై తరచూ ప్రధాన చికిత్స కేంద్రాలను తనిఖీ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో విఆర్.పురం, చింతూరు, కూనవరం, ఎటపాక తహశీల్దార్లు శ్రీధర్, కారం సుబ్బయ్య, అనసూయ, పృధ్వీ, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య

రాసలీలలు సాగిస్తున్న ప్రిన్సిపల్‌పై చర్యకు వినతి

ఐటిడిఎ పిఒ కు వినతిపత్రం ఇస్తున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని వై.రామవరం మండలం పి.ఎర్రగొండ ఎపిటిడబ్ల్యు గురుకుల కళాశాల ప్రిన్సిపల్ తన ఆఫీసు రూమ్‌లోనే రాసలీలలు సాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎర్రగొండ గురుకుల కళాశాల సమస్యలపై ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరేకు బుధవారం ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈ నెల 25న ఎర్రగొండ గురుకుల కళాశాలను తమ సంఘం బృందం సందర్శించిన సందర్భంలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. 22వ తేదీన కళాశాలకు వచ్చిన గురుకులం జాయింట్ సెక్రటరీకి రాతపూర్వకంగా ఇచ్చిన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కళాశాల ఆవరణలోని బోరు ఐదు నెలలుగా పనిచేయడం లేదని, కళాశాలలో ఉన్న బాత్ రూమ్ తలుపులు విరిగిపోవడంతో ఆడ పిల్లలు ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యలను పరిష్కరించాలని, సెప్టిక్ ట్యాంక్ క్లిన్ చేయాలని కోరారు. ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఏ కళాశాలలో లేని నిబంధనలు వలన పిల్లలు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని, తల్లిదండ్రులు ఆదివారం రోజున తమ పిల్లలను చూడడానికి పది నిమిషాలు టైమ్ కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఆఫీసు రూమ్‌లో రాసలీలలు సాగిస్తున్నారని గమనించిన విద్యార్థులు సిబ్బందికి తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని గురుకులం జాయింట్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినా ఆయన కూడా స్పందించలేదని పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి బుద్ధులు నేర్పాల్సిన ప్రిన్సిపాలే కళాశాలలో ఇటువంటి తప్పుడు చర్యలకు పాల్పడటం దురదృష్టకరమని, తక్షణమే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండ్ల సూరిబాబు, సహాయక కార్యదర్శి తీగల శ్రీనివాస్, నాయకులు కె.శాంతిరాజు పాల్గొన్నారు.

స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సైనికుల కుటుంబాల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-పాడేరు: దేశ రక్షణకు నిరంతర సేవలు అందిస్తూ యుద్ధంలో మరణించిన, పదవీ విరమణ గావించిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి మనమంతా సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ చాంబర్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రూ.20 వేలు విలువ గల సాయుధ దళాల పతాక స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్ జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఏటా డిసెంబర్ ఏడవ తేదీన దేశ వ్యాప్తంగా సాయుధదళాల పతాక దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు పతాక దినోత్సవానికి విరివిగా విరాళాలు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. విద్యార్థులు, కార్మికుల నుంచి సైనిక సంక్షేమానికి విరాళాలు సేకరించే విధంగా ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారిని ఆదేశించారు. స్టిక్కర్ రెండు రూపాయలు, కార్ ఫ్లాగ్ ఐదు రూపాయలకు చొప్పున అమ్మడం ద్వారా వచ్చిన విరాళాలను సంచాలకులు, సైనిక సంక్షేమ శాఖ (విజయవాడ) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబర్ 33881128795 కు జమ చేసి జిల్లా సైనిక సంక్షేమ అధికారి (విశాఖపట్నం) తెలియ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి జి. సత్యానందం, పర్యవేక్షకులు కృష్ణారావు, సిబ్బంది వై. శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కురసా పార్వతమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పురంధేశ్వరి

మౌలిక వసతుల కల్పనకు కృషి

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న పథకాలకు స్టిక్కర్ వేసుకుని మనుగడ సాగిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి జగన్ పాలనపై విమర్శలు సంధించారు. బుధవారం ఆమె పాడేరులో పర్యటించారు. స్థానికఎస్ ఆర్ కళ్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడుతూ, సామాజి న్యాయంతో పాటు మౌలిక వసతులు కల్పనపై కృషి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో రహదారులు, నెట్వర్క్ కనెక్టివిటీ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు పాడేరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం 370 కోట్లు సహాయం అందించిందన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని విమర్శించారు. పాడేరు లోని గిరిజన సహకార సంస్థ లో పలు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి డివిజనల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందిన కురసా పార్వతమ్మ పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డుల తొలగింపు అన్యాయం

ఐటిడిఎ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని గురుకుల ఏకలవ్య పాఠశాలలు, కళాశాలలో పని చేస్తున్న మహిళా సెక్యూరిటీ గార్డులు తమ ఉద్యోగాల తొలగింపుపై ఆందోళన బాట పట్టారు. ఇటీవల ఐటీడీఏ ఎదుట నిరసన తెలియజేసి బుధవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సెక్యూరిటీ గార్డులుగా పాఠశాలల్లో ఉద్యోగాలు పొందిన కొద్ది రోజులకే తమకు ఉద్వాసన పలకడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకుల, ఏకలవ్య పాఠశాలు కళాశాలల్లో పని చేస్తున్న ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డులను తక్షణమే వీధుల్లోకి తీసుకోవాలని, టెండర్ మారిందనే కారణంతో తమను తొలగించడం అన్యాయమని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డ్‌ల సంఘం, ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.బాలదేవ్, ఎస్.ధర్మన్నపడాల్, ఎల్.సుందర్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డుల సంఘం కార్యదర్శి గంపరాయి సీతమ్మ మాట్లాడుతూ, 2022 ఆగస్టు 15 తేదీ నుండి సేవా సుప్రీమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా గురుకులం ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో సెక్యూరిటీ గార్డులుగా నియమించారని తెలిపారు. విధులు నిర్వహిస్తున్న 60 మంది ఆదివాసి మహిళా సెక్యూరిటీ గార్డులను టెండర్ కాంట్రాక్ట్ మారిందనే కారణంతో విధుల్లో నుంచి తొలగించి కొత్తవారిని నియమించడం అన్యాయమని ఖండించారు. 2023 నవంబర్ 1 నుండి కొత్తవారు వస్తారని మీరు ఇంటికి వెళ్లి పోవాలని చెప్పడం దుర్మార్గమని, ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓకు ఇప్పటికే ఆదివాసి మహిళ సెక్యూరిటీలు ఫిర్యాదు చేశారని తెలిపారు. తాము ఎలా రిక్రూట్ అయ్యారని అధికారులు అడుతున్నారని, వారికి తెలియకుండా సెక్యూరిటీ ఏజెన్సీ టెండర్ ఎలా పాడుకుందని ప్రశ్నించారు. టెండర్ కాంట్రాక్టు పేరు మారిందనే కారణంతో ఇప్పటికే పని చేస్తున్న 60 మంది ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులను తొలగించి కొత్తవారిని నియమిస్తామని చెప్పడం ఆదివాసి మహిళలను అన్యాయం చేయడమేనన్నారు. గతంలో వీరికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలు ఇప్పించాలని ఈ సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

దీక్షలను ప్రారంభిస్తున్న బాలదేవ్

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని రెండు మార్లు కలిసారని, సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, మహిళల సెక్యూరిటీ గార్డుల పట్ల కనీసం జాలి లేకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని, పాతవారిని రెన్యువల్ చేసి కొనసాగించాలని కోరారు. టెండర్ మారిన ప్రతిసారి ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులను మార్చడం దుర్మార్గమన్నారు. తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళ సెక్యూరిటీ గార్డులు ఎస్.కస్తూరి, ఎం.బేబీ, బి రాజమ్మ, గెమ్మెలి మంగమ్మ, సావిత్రి, నాగమణి, ఎం.సింహాచలం, గంగా భవాని, నాగమణి, సిహెచ్ జ్యోతి, లక్ష్మి, శాంతి, హేమలత, నిర్మల, రాజేశ్వరి, జ్యోతి, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన

రూ.7.57 కోట్లతో పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏర్పాటు

శంకుస్థాపనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున తదితరులు

ప్రజాశక్తి-విశాఖపట్నం

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా రూ.7.57 కోట్లతో పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో నిర్మించనున్న ఎఫ్ఎఫ్‌సి (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు)కు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పలు పరిశ్రమల ప్రారంభోత్సం, శంకుస్థాపన సందర్భంగా తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ఈ కార్యక్రమం చేపట్టారు. 1.22 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సుకు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్టుకు కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వ్యయం సమకూర్చనున్నాయి. స్థానిక కలెక్టరేట్ వీసీ హాలులో ఏర్పాటు చేసిన నమూనా శిలాఫలకాన్ని వర్చ్యువల్ విధానంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పరిశ్రమల శాఖ జీఎం గణపతి, ఐలా కమిషనర్ జయచంద్ర, ఏపీఐఐసీ అధికారులు, పలువురు పారిశ్రామిక వేత్తలు భాగస్వామ్యమయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, కాంప్లెక్సు ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని, సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, నీటి వసతి, ఇతర సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి గణేశ్వరరావు

మాంసం వ్యాపారులకు అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కాశిపట్నం అరకు సంతలో పశువులు, మేకలు విక్రయిస్తున్న మాంసం వ్యాపారస్తులకు అవగాహన కల్పించామని కాశీపట్నం వైద్య అధికారి సాగరి గణేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేకలు, గొర్రెలు క్రయ విక్రయ చేసే వ్యాపారస్తులు వ్యాధులు లేని వాటిని మాత్రమే విక్రయించాలని సూచించారు. మాంసం విక్రయంపై పంచాయితీ అధికారుల అనుమతులు తప్పనిసరి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రంలో పినకోట పశు వైద్య ఉపకేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారిని సుధావని పాల్గొన్నారు

కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి అనంతగిరి: పెంపుడు కుక్కలకు టీకాలు వేశామని అనంతగిరి పశు సంవర్ధక శాఖ వైద్య అధికారి సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెంపుడు కుక్కల యాజమానులకు వీటిపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీను, రామ్మూర్తి, శ్యామ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు

ఆందోళన విరమించాలి

ప్రజాశక్తి-పాడేరు: వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు వెంటనే ఆందోళనను విరమించుకుని విధుల్లో చేరాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సచివాలయాల పరిధిలో గ్రామీణ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం జిల్లాలో 297 మంది సిహెచ్వోలను ఒక ఏడాది కాంట్రాక్ట్ పద్ధతిక నియమించిందని చ్ స్పష్టం చేసారు. ఈ కార్యక్రమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కొనసాగిస్తున్నందున ఇందులో ఉద్యోగాల రెగ్యులరైజేషన్ ప్రశ్నే తలెత్తదని కమీషనర్ స్పష్టం చేశారని డిఎంహెచ్ఐ తెలిపారు. తమ ఆందోళన విరమించకుండా దశలవారీ ఆందోళన పేరుతో విధులను విస్మరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆందోళన విరమించి విధుల్లో చేరాలని కోరారు.

రైల్వేలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్ సింహాచలం రైల్వేస్టేషన్ యార్డులో రియల్ టైమ్ రిలీఫ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ల కోసం సమగ్ర మాక్ డ్రిల్ బుధవారం నిర్వహించారు. వివిధ విభాగాల్లో అత్యవసర పరిస్థితులను నిర్వహించడంలో సంసిద్ధత, సమన్వయం ప్రాముఖ్యతను తెలిపేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ స్వయంగా కార్యకలాపాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రైల్వే సిబ్బంది సంసిద్ధతను అంచనా వేయడంలో మాక్ డ్రిల్ ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. పయాణికులను రక్షించడం, సహాయక చర్యలు చేపట్టడం, త్వరితగతిన సాధారణ పరిస్థితులు నెలకొనడం గురించి వివరించారు. డ్రిల్ విజయవంతం కావడానికి సహకరించిన స్థానిక యంత్రాంగానికి డిఆర్ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, ఎడిఆర్ఎం (ఇన్ ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ్ ప్రధాన్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. సింహాచలం యార్డు వద్ద 08854 నంబరు గల ప్రత్యేక రైలుకు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. వాస్తవ అత్యవసర పరిస్థితిని అనుకరించడానికి రియల్ టైమ్ రిలీఫ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఆర్ఇఎస్‌సి కోసం సిబ్బంది సామగ్రిని నియమించారు. ఈ మెకానికల్, క్యారేజ్ అండ్ వ్యాగన్, ఆపరేషన్స్, కమర్షియల్, మెడికల్, సెక్యూరిటీ, సిగ్నల్ అండ్ టెలికాం, సివిల్ ఇంజినీరింగ్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, ఎలక్ట్రికల్, పర్సనల్, ఫైనాన్స్ తదితర విభాగాలు చురుగ్గా పాల్గొన్నాయి. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్), అగ్నిమాపక దళ బృందాలు, సివిల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు ఈ డ్రిల్ లో పాల్గొన్నాయి.

శ్రమదానంతో రహదారి ఏర్పాటు

ప్రజాశక్తి -సీలేరు : గూడెం కొత్తవీధి మండలం జెర్రిల పంచాయతీ పరిధి జెర్రిల కొత్తూరు గ్రామ గిరిజనులు తమ గ్రామానికి శ్రమదానంతో రహదారిని అభివృద్ధి చేసుకున్నారు. పెద్ద పెద్ద రాళ్ళు, గోతులతో ఉన్న మట్టి రోడ్డును బుధవారం గ్రామస్తులు శ్రమదానంతో చదును చేసి గుంతలు పూడ్చారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో రోగులను డోలిమేతతో ఆసుపత్రికి తీసుకెళ్లవలసిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్ రావటానికి కూడా రహదారి సౌకర్యం లేక అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయిన సందర్భాలు ఉన్నాయని వాపోయారు. తమ గ్రామానికి రహదారి నిర్మించాలని అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా, గ్రామస్తులు స్వయంగా పాడేరు వెళ్లి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి విన్నవించినా ఫలితం లేకపోవడంతో తామే స్వయంగా గ్రామానికి శ్రమదానంతో రహదారి నిర్మించుకుంటున్నామని గ్రామస్తులు చెప్పారు. ప్రతి ఏటా శ్రమదానంతో ఈ మట్టి రోడ్డు గుంతులు కప్పుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ప్రభుత్వ అధికారులు స్పందించి తమ గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మించుకుంటున్న గిరిజనం

కార్తీక వన సమారాధన

మాట్లాడుతున్న ప్రభాకరరావు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన, జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకర్‌రావు, కార్యదర్శి విబిటి రాజు, ఉపాధ్యక్షులు గంగుమల్ల రాంబాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బళ్ళ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, కోశాధికారి పి.చిన్ని హాజరై మాట్లాడారు. అసోసియేషన్ బలోపేతం చేసుకోవాలని, ప్రాథమిక వైద్యులు తమ పరిధిలోనే వైద్య సేవలను ప్రజలకు అందించాలని, ప్రభుత్వం నిర్వహించే ఎయిడ్స్, మలేరియా, క్షయ వంటి వ్యాధులపై నిర్వహించే అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొవాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కన్వీనర్ కె.జగదీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం జిల్లా కో కన్వీనర్లు బివివి సత్యనారాయణ, చిన్నం సిల్వెస్టర్, ఎమ్.వెంకటేశ్వర్లు, గోకవరం మండల అధ్యక్షులు ఎమ్.నాగేశ్వరరావు, కార్యదర్శి వై.పవన్ కుమార్, కోశాధికారి డి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

1న అత్యవసర సమావేశం

ప్రజాశక్తి కొయ్యూరు: వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సూపర్వైజర్లతో డిశంబరు నెల 1వ తేదీన అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా, హెచ్‌బీ పరీక్షలు, బాల్య వివాహాల నిరోధం, అంగన్వాడీ సిబ్బంది విధులు, సంపూర్ణ పోషణ తదితర అంశాలపై సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- చింతూరు : మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఈ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జోగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు తెలిపారు. మండలంలోని తులసిపాక, మోతుగూడెం పిహెచ్‌సిలో బుధవారం కాంట్రాక్టు ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగరావు, సత్తిబాబు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, లేదంటే మళ్లీ ఎలక్షన్స్ వచ్చి ఆగిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏజెన్సీ ఏరియాలో నెంబర్ 68ని అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలపై త్వరలో జిల్లా స్థాయి సమావేశం ఉంటుందని, ఆదివాసీ మెడికల్ ఉద్యోగులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.నరేష్, పి.సుధ, టి.ఆదిలక్ష్మి, యం.చుక్కమ్మ, పి.రజిని, యం.శివ, యస్.రాజు, టి.కన్నయ్య, జె.విజయ దుర్గ, పి.రజిని, ఎ.సుబ్బలక్ష్మి, జి.రాజు, బాలకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం నేతలు

ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : 2024 ఫిబ్రవరి 10, 11 తేదీలలో చింతూరులో జరుగు జాతీయస్థాయి ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనం, 5వ రేలా పండగను విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, భాష, కళలు, సాహిత్యం, సాంప్రదాయ పండుగలు, ఆచార వ్యవహారాలపై విద్యార్థులు ఇప్పటి నుండే అవగాహన కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ సంస్కృతిని పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అస్తిత్వం పరిరక్షణకై రేలా పండగను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు వచ్చే ఆదివాసీ కళాకారులు, సాహితీ వేత్తలు, మేధావులు ముందుగా తమ పేర్లను 9642067386, 9573946097 మొబైల్ నెంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి చందు, పోడియం శ్రీనివాసు దొర, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశు ఆరోగ్య రక్షణ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని నడింపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో పాడి పశువులున్న రైతులకు ఏహెచ్ఎ సుశీల బుధవారం పశు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. పాడి పశువులు ఉన్న రైతులు హెల్త్ కార్డులు కలిగి ఉండాలని, దీని ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే వ్యాక్సిన్‌లను పశువులకు అందించడం జరుగుతుందని సుశీల చెప్పారు. పాడి రైతులు హెల్త్ కార్డుల కోసం తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఏహెచ్ఎల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పాడిరైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశు ఆరోగ్య రక్షణ కార్డుల పంపిణీ

గృహ నిర్మాణాల కూల్చివేత దుర్మార్గం

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి నుంచి అన్ని అనుమతులు తీసుకుని 85వ వార్డు అగనంపూడి పునరావాసకాలనీ కొండయ్యవలస గ్రామంలో కేవలం 40 అడుగుల్లో నిర్మిస్తున్న ఇంటి శ్లాబ్‌ను ఎటువంటి నోటీసు, ముందస్తు హెచ్చరిక లేకుండా అధికారులు కూల్చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు..విషయం తెలిసిన వెంటనే బాధితులు గౌరేశ్వరి పుణ్యవతి కుటుంబాల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదల్ని ఆదుకుంటామని గొప్పలు చెప్పిన వైసిపి ప్రభుత్వం, రెండునెలలుగా నిర్మిస్తున్న ఇంటిని, యజమానులు లేని సమయంలో కూల్చివేయడాన్ని ఖండించారు. వైసిపి నేతలు చెప్పిందే వేదం అన్నట్లు అధికారులు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. టిడిపి నేతలు బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, విందుల రాజు, ఈగల పోలి నాయుడు, ఎలమంచిలి రమణ, పలక రాము, జనసేన నాయకులు గోంతిన గోపి పాల్గొన్నారు.

అంతర్జాతీయ నగరంగా విశాఖ

ప్రజాశక్తి- గాజువాక: అంతర్జాతీయ నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. బుధవారం 72వ వార్డు వంద అడుగుల రోడ్డులో రూ.2 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో రోడ్లు, ఇతర ఆధునికీకరణ పనులకు జివిఎంసి కోట్లాది రుపాయలను ఖర్చు చేస్తోందన్నారు. నగరాభివృద్ధిపై సిఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు.ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక సమగ్రాభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వార్డు కార్పొరేటర్ ఎజె స్టాలిన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సిరట్ల వాసు, టిడిపి నేత సాలాపు రామారావు, స్థానిక నాయకులు సత్యనారాయణ, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న విశాఖ నగర మేయర్,

ఓటు నమోదు చేసుకోవాలి

ర్యాలీలో పాల్గొన్న తహశీల్దార్, ఇతర అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి- కొయ్యూరు : 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ తిరుమలరావు సూచించారు. మండలంలోని కాకరపాడు గురుకుల కళాశాల విద్యార్థులతో బుధవారం రాజేంద్రపాలెం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ దుమంతి సత్యనారాయణ, ఆస్ఐలు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

3 రోజుల పాటు ఆధార్ సేవలు

ప్రజాశక్తి- కొయ్యూరు : కొయ్యూరు ఎంపీడీవో లాలం సీతయ్య ఆదేశాల మేరకు రావణా పల్లి పంచాయతీ కేంద్రం లో మూడు రోజుల పాటు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శి రజని తెలిపారు. ఈమేరకు ఆధార్ సేవలను సర్పంచ్ కాకురు లక్ష్మి, ఏఎంసీ డైరక్టర్ అచ్యుత్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు అవసరమైన వారు ఈ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు.

ఆధార్ కేంద్రం ప్రారంభోత్సవంలో రజని

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- రంపచోడవరం : మండలంలోని ఇర్లపల్లి గ్రామ సమీపంలో ఆటో, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పూనెం సత్యనారాయణ (20) రంపచోడవరం నుండి బైకుపై జాగరంపల్లి వైపు వెళుతున్నాడు. ఇర్లపల్లి గ్రామ సమీపంలో ఈ బైక్, సితపల్లి వైపు నుంచి వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న పూనెం సత్యనారాయణ సంఘటనా స్థలంలో మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆయన్ను వైద్య సేవల నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మృతుడు సత్యనారాయణ